సాక్షి
ప్రకాశం
సోమవారం । 15 । సెప్టెంబర్ । 2025



అభినవ విశ్వకర్మ మోక్షగుండం
దేశంలో ఎన్నో ప్రాజెక్టులకు రూపకల్పన చేసిన అభినవ విశ్వకర్మ మోక్షగుండం విశ్వేశ్వరయ్య. నేడు ఆయన జయంతి. - 8లో..



మార్కాపురం మెడికల్ కాలేజీని ప్రభుత్వమే నిర్వహించాలి
మార్కాపురం మెడికల్ కాలేజీని ప్రభుత్వమే నిర్వహించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
33 /28

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

వెలుగొండ ప్రాజెక్టుపై చిత్తశుద్ధి నిరూపించుకోవాలి

● మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి

మార్కాపురం: వెలుగొండ ప్రాజెక్టుపై కూటమి ప్రభుత్వం కపటనాటకాలు ఆపి ప్రాజెక్టును త్వరగా పూర్తిచేసి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని మాజీ ఎమ్మెల్యే, నెల్లూరు పార్లమెంట్ వైఎస్సార్ సీపీ పరిశీలకుడు జంకె వెంకటరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల్లో మార్కాపురం ప్రచార సభకు వచ్చినప్పుడు తానే వెలుగొండను పూర్తి చేస్తానని హామీ ఇచ్చారన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని అన్నారు. వెలుగొండ పూర్తిచేస్తేనే ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని, కరువు పోతుందన్నారు. ముంపు గ్రామాల నిర్వాసితులకు వెంటనే నిధులు విడుదల చేసి వారి కుటుంబాలను ఆదుకోవడంతోపాటు పునరావాస కాలనీల్లో గృహాలు పూర్తిచేసి మౌలిక వసతులు కల్పించాలన్నారు. మూడు జిల్లాల్లో శాశ్వతంగా కరువును నివారించే వెలుగొండ ప్రాజెక్టుపై నిర్లక్ష్యం వహించవద్దన్నారు.

ఐలమ్మ స్ఫూర్తితో పోరాటాలు నిర్మిస్తాం



ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఒంగోలు టౌన్: భూస్వామ్య దోపిడీని ఎదిరించి నిలిచిన వీరనారి ఐలమ్మ, బషీర్ బాగ్ విద్యుత్ ఉద్యమంలో మరణించిన రామకృష్ణల స్ఫూర్తితో భవిష్యత్తు పోరాటాలను నిర్మిస్తామని రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి రాయల మాలకొండయ్య చెప్పారు. ఆదివారం నగరంలోని ఎల్బీజీ భవనంలో ఐలమ్మ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా మాలకొండయ్య మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల ఫలితంగా గ్రామాల్లో భూ కబ్జాలు పెరిగిపోయాయని, అక్రమ కేసులు ఎక్కువయ్యాయని చెప్పారు. ప్రజలకు చెందాల్సిన ప్రభుత్వ భూములను కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తున్నారని, దీనికి వ్యతిరేకంగా ప్రజలు పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. సంఘం జిల్లా అధ్యక్షుడు టంగుటూరి రాము మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో 2000 సంవత్సరంలో విపరీతంగా పెంచిన కరెంటు బిల్లులకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో బషీర్‌బాగ్ పోలీసు కాల్పుల్లో అమరులైన రామృష్ణ, విష్ణువర్ధన్ రెడ్డి, బాలస్వామి స్ఫూర్తితో రానున్న రోజుల్లో ఉద్యమాలను ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో డా.కృష్ణయ్య, చీమకుర్తి కోటేశ్వరరావు, చందలూరు శ్రీనివాసులు, యోగమ్మ, బొప్పరాజు హరిబాబు, రాయల్ల కాశయ్య పాల్గొన్నారు.

యూటీఎఫ్ రణభేరిని జయప్రదం చేయాలి

● యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు శ్రీనివాసరావు

ఒంగోలు సిటీ: జిల్లాలో ఈనెల 18, 19 వ తేదీల్లో జరిగే యూటీఎఫ్ రణభేరి జాతాను జయప్రదం చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కొమ్మోజు శ్రీనివాసరావు అన్నారు. ఒంగోలు యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం యూటీఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్ హై అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న విద్యారంగ సమస్యలు, ఆర్థిక అంశాల మీద ఉపాధ్యాయులను చైతన్యవంతం చేసేందుకు యూటీఎఫ్ రాష్ట్ర సంఘం రణభేరి బైకు జాతాను ఈనెల 15వ తేదీ నుంచి 19వ తేదీ వరకు రూపొందించిందని తెలిపారు. దీనికి జిల్లాలోని ఉపాధ్యాయులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఉపాధ్యాయులకు రావాల్సిన డీఏ బకాయిలు, సరెండర్ లీవ్ బకాయిలు, సీపీఎస్ 90 శాతం బకాయిలు, 11వ పీఆర్సీ బకాయిలు, 12వ పీఆర్సీ కమిషన్ నియమించడం, 30 శాతం ఐఆర్ ప్రకటించడం, రిటైర్డ్ అయిన ఉపాధ్యాయులకు గ్రాట్యుటీ, కమ్యూటేషన్, ఎన్‌క్యాష్‌మెంట్ తదితర సమస్యలను పరిష్కరించాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి డీ వీరాంజనేయులు మాట్లాడుతూ జిల్లాలో రణభేరి బైకు జాతా ఈ నెల 18వ తేదీ మధ్యాహ్నం కనిగిరిలోకి ప్రవేశిస్తుందని గిద్దలూరు, బేస్తవారిపేట, కంభం, మార్కాపురం, పొదిలి, దర్శి, చీమకుర్తి మీదుగా ఒంగోలుకు 19 తేదీ సాయంత్రం 6 గంటలకు చేరుకుంటుందని చెప్పారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్ హై, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు ఓవీ వీరారెడ్డి, జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎస్ రవి, జిల్లా సహాధ్యక్షురాలు జి ఉమామహేశ్వరి, జిల్లా కోశాధికారి ఎస్ చిన్నస్వామి, జిల్లా కార్యదర్శి ఎం సత్యనారాయణ రెడ్డి, పీ బాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

‘సాక్షి’పై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలి



కీలకమైన పత్రికా వ్యవస్థపై కూటమి ప్రభుత్వం కక్ష కట్టడం దారుణం. ప్రజా సమస్యలను వెలుగులోకి తెస్తున్నారన్న కోపంతో సాక్షి పత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డితో పాటు ఇతర రిపోర్టర్లపై రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలి. ప్రజాస్వామ్యంలో పత్రికలపై కేసులు పెట్టడం మంచి సాంప్రదాయం కాదు. పత్రికా వ్యవస్థను గౌరవించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. పాలకులకు నచ్చని వార్తలొస్తే ఖండన ఇవ్వొచ్చు. అంతేకానీ ఇలా వరుసగా కేసులు పెట్టడం ప్రజాస్వామ్యంలో మంచిదికాదు.
– జంకె వెంకటరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నెల్లూరు పార్లమెంట్ పరిశీలకుడు



పత్రికా స్వేచ్ఛను హరించే హక్కు ఎవరికీ లేదు



పత్రికా స్వేచ్ఛను హరించే హక్కు ఎవరికీ లేదు. కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు మంచిది కాదు. ప్రజాస్వామ్య దేశంలో నిజాలను నిర్భయంగా రాస్తే పాత్రికేయులపై కేసులు నమోదు చేయడం దారుణం. కూటమి ప్రభుత్వం ప్రశ్నించే వారిపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోంది. సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డి, పాత్రికేయులపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేసి పత్రికా స్వేచ్ఛను కాపాడాలి.
– కసుకుర్తి ఆదెన్న, మాజీ ఎమ్మెల్యే

సీనరేజ్‌పై ప్రైవేట్ పెత్తనం!

మీ సొంత స్థలం నుంచి.. ఇంటి అవసరాల కోసం మట్టి, ఇసుక తరలిస్తున్నా సరే ఇకపై పన్ను వసూలు చేస్తారు. సీనరేజి వసూళ్ల బాధ్యతను ప్రైవేటుకు కట్టబెట్టడంతో వసూళ్ల పర్వం ఇష్టారాజ్యంగా సాగనుంది. ఉమ్మడి జిల్లా పరిధిలో రెండేళ్ల పరిమితికి రూ.1136 కోట్లకు ఏఎంఆర్ సంస్థ కాంట్రాక్టు దక్కించుకుంది. ఇకపై ఆ సంస్థే సీనరేజి వసూలు చేసి ప్రభుత్వానికి కట్టనుంది. ఈ ప్రైవేటు సైన్యం పెత్తనంతో గ్రానైట్ క్వారీల యజమానులు, ఫ్యాక్టరీల యజమానులు, కంకర మిల్లుల నిర్వాహకులతో పాటు సామాన్య, మధ్యతరగతి ప్రజలపై భారం పడుతుందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.





- ప్రైవేటు సంస్థకు సీనరేజి వసూలు బాధ్యత
- ఈనెల 25న అప్పగించనున్న గనుల శాఖ అధికారులు
- నెలకు రూ.47.3 కోట్లు ప్రభుత్వానికి జమ చేయనున్న సంస్థ
- సొంత పొలంలో ఇసుక తవ్వినా పన్ను కట్టాల్సిందే..
- గ్రానైట్, కంకర, మట్టి, గ్రావెల్ తరలించినా పన్ను వసూలు

ఒంగోలు సిటీ:

చంద్రబాబు ప్రభుత్వం చెబుతున్నదొకటి.. చేస్తున్నదొకటి. సంపద సృష్టిస్తాం అంటూ ఏదో రకంగా ప్రజలపై భారం మోపుతోంది. సొంత పొలంలో ఇంటి అవసరాల నిమిత్తం మట్టి, కంకర వంటివి తరలించినా పన్నులు చెల్లించాల్సిందే. ఉమ్మడి జిల్లాల్లో ఇప్పటి వరకూ మైన్స్ అధికారులు గ్రానైట్, ఇతర క్వారీల నుంచి నెలకు సుమారు రూ.36 కోట్లు వసూలు చేస్తున్నారు. తాజాగా టెండరు దక్కించుకున్న సంస్థ రూ.47.3 కోట్లు ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంది.

రెండేళ్ల పరిమితికి రూ.1136 కోట్లు

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో గ్రానైట్ ఇతర క్వారీల నుంచి సీనరేజ్ వసూలు చేసి రెండేళ్లలో ప్రభుత్వానికి రూ.1136 కోట్లు చెల్లించేలా ఏఎంఆర్ సంస్థ కాంట్రాక్టు దక్కించుకుంది. ఈ లెక్కన సదరు సంస్థ నెలకు రూ.47.3 కోట్లు ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంది. ఇంటి అవసరాలకు, క్వారీల్లో చిన్న తవ్వకాలు చేసినా ముక్కుపిండి సీనరేజ్ వసూలు చేస్తారు. సదరు సంస్థ మైన్స్ అధికారులు వసూలు చేస్తున్న రూ.36 కోట్లు కంటే అదనంగా రూ.5 కోట్ల నుంచి రూ.10 కోట్లు వసూలు చేసేలా రంగం సిద్ధం చేసినట్టు తెలుస్తోంది. ఇప్పటి వరకూ మైన్స్ అధికారులు సంవత్సరానికి రూ.435 కోట్లు వసూలు చేస్తున్నారు. తాజాగా ప్రైవేటు సంస్థ దాదాపు రూ.600 కోట్ల వరకూ వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలుస్తోంది. ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రజలు, క్వారీ నిర్వాహకులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ నెల 25వ తేదీ నుంచి సీనరేజ్ వసూలు చేసే బాధ్యతను టెండరు దక్కించుకున్న సంస్థకు అప్పగించనున్నారు.

ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలో 600 వరకూ గ్రానైట్ క్వారీలతో పాటు చిన్నా, పెద్దా కంకర, గ్రావెల్ క్వారీలు ఉన్నాయి. క్వారీ నుంచి రాళ్లు, గ్రావెల్ వంటివి బయటకు తరలించాలంటే నిబంధనల ప్రకారం సీనరేజీ చెల్లించాలి. ప్రస్తుతం గనులశాఖ అధికారుల స్థానంలో ప్రైవేటు సిబ్బంది ఈ బాధ్యతలు చేపడతారు. ఇప్పటి వరకూ మైన్స్ అధికారులు గ్రానైట్ క్వారీలో ముడిరాయి క్యూబిక్ మీటరుకు రూ.5 వేల వరకు వసూలు చేస్తున్నారు. ప్రస్తుతం టెండరు దక్కించుకున్న సంస్థ కొలత ప్రకారం ఎంత ముడిసరుకు బయటకు వెళ్లిందో లెక్కించి అందుకనుగుణంగా పన్నులు ముక్కుపిండి వసూలు చేస్తారు. ఈ నెల కొంతే పన్నులు వసూలయ్యాయని తప్పించుకోకుండా చెల్లించాల్సిందే. సీనరేజీ అంచనా వేసిన మేరకు విభాగాల వారీగా ఆయా ప్రభుత్వ ఖాతాలకు నెల వారీ సొమ్ము జమ చేయాల్సి ఉంటుంది. గ్రానైట్, కంకర తదితరాల మాదిరే గ్రామాల్లో మట్టి, గ్రావెల్ వంటివి తరలించినా పన్ను రాబట్టేందుకు ప్రయత్నిస్తారు. జిల్లాలో నిత్యం సుమారు 2 వేల నుంచి 3 వేల వరకు చిన్న పెద్ద భవన నిర్మాణాలు జరుగుతుంటాయి. వీటికి భారీగా మట్టి, గ్రావెల్ అవసరం ఉంటుంది. గ్రావెల్, మట్టిలకు సంబంధించి సీనరేజీలను ప్రైవేటు వ్యక్తులు ముక్కుపిండి వసూలు చేస్తారు. ఫలితంగా సామాన్య, మధ్య తరగతి ప్రజలు చేపట్టే నిర్మాణాలపై భారం పడనుంది.

ఆర్థిక భారం పడుతుంది

ప్రైవేటు ఏజెన్సీ ద్వారా వసూలు చేయడం వలన గ్రానైట్ క్వారీల యజమానులు, ఫ్యాక్టరీల యజమానులు, కంకర మిల్లుల నిర్వాహకులకు అదనపు ఆర్థిక భారం పడుతుంది. ప్రభుత్వం రాయల్టీ ప్రకారం సీనరేజీ వసూళ్లలో ఎంతోకొంత సానుభూతి ఉంటుంది. దాని వలన గ్రానైట్ రాళ్లల్లో రాయల్టీ వసూళ్లలో ఉదార స్వభావం ఉంటుంది. అదే ప్రైవేటు ఏజెన్సీలకి ఇస్తే రాళ్ల స్లాబులు, కంకర, చివరకు మట్టి మీద కూడా రాయల్టీ సీనరేజీ వసూలు చేయడంలో ఏజెన్సీ నిర్వాహకులు ముక్కుపిండి వసూలు చేస్తారని గ్రానైట్ తయారు గ్రానైట్ పారిశ్రామిక వర్గాలు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు వసూళ్లు చేసిన సీనరేజీ నిధులను ప్రభుత్వానికి జమ చేసే లోపే నిధుల దుర్వినియోగం కూడా జరిగే అవకాశం ఉంది.
– ఆర్ లక్ష్మీనారాయణ, వీటీసీ కేంద్రం అధ్యక్షుడు, రామతీర్థం

రైతు కళ్లల్లో దైన్యం

- ఇలా అయితే ఎలా చేయాలి సేద్యం
- ముఖం చాటేసిన రుతుపవనాలు
- సాగు లక్ష్యం 1,29102 హెక్టార్లు.. సాగైంది 68,983 హెక్టార్లు
- ఖరీఫ్ ముగుస్తున్నా జిల్లా మొత్తం మీద 53.43 శాతం మాత్రమే సాగు

మార్కాపురం: ఖరీఫ్ సీజన్ ముగుస్తున్నా పొలాల్లో కాడి ముందుకు కదలడంలేదు. రుతుపవనాలు ముఖం చాటేయడంతో జిల్లా వ్యాప్తంగా పంటల సాగు నత్తనడకతో పోటీపడుతోంది. గత ఏడాది ఇదే రోజుకు 69,507 హెక్టార్లలో వివిధ పంటలు సాగు కాగా, ఈ ఏడాది ఇప్పటి వరకూ 68,983 హెక్టార్లలో పంటలు సాగు చేశారు. మరో పది రోజుల్లో ఖరీఫ్ సీజన్ ముగుస్తున్నా పంటల సాగు ముందుకు సాగడం లేదు. దీంతో ఈ ఏడాది రైతులకు ఖరీఫ్ కష్టాలను, కన్నీళ్లను మిగిల్చింది. మరోవైపు సాగుచేసిన పంటలకు ఎరువులు దొరక్క రైతులు రోడ్డెక్కుతున్నారు. పత్తి ధర కూడా ప్రస్తుతం అంతంత మాత్రంగానే ఉంది. ఇంకోవైపు గత ఏడాది సాగుచేసిన పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. మార్కాపురం డివిజన్‌లో తర్లుపాడు మండలంలో గడచిన ఆరు నెలల కాలంలో ముగ్గురు రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

జిల్లాలో సాగు లక్ష్యం 1,29102 హెక్టార్లు కాగా సాగైంది 68,983 హెక్టార్లు మాత్రమే అంటే 53.43 శాతం మాత్రమే పంటల సాగు నమోదైంది. ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడం, కురిసిన వర్షాలు కూడా అంతంతమాత్రంగానే ఉండటంతో సాగుచేయాలంటే రైతులు భయపడుతున్నారు. మరీ తక్కువగా పంటలు సాగు కావడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. దీంతో ఈ ప్రభావం వచ్చే రబీ సీజన్‌పై పడనుంది. ఆహార ధాన్యాలు, గ్రాసం కొరత ముందు ముందు తీవ్ర రూపం దాల్చనుంది.

మొక్కజొన్న సాగుపై దృష్టి

ఈ ఏడాది జిల్లావ్యాప్తంగా రైతులు మొక్కజొన్న సాగుపై దృష్టిపెట్టారు. సాగు లక్ష్యం 3120 హెక్టార్లు కాగా ఇప్పటికే 4,952 హెక్టార్లలో సాగు చేశారు. ఆ తరువాత కంది, మిర్చి పంటలు సాగయ్యాయి. కంది సాగు లక్ష్యం 68,287 కాగా ఇప్పటి వరకూ 36,074 హెక్టార్లలో సాగైంది.



ఖరీఫ్‌లో ఇంకా సాగు చేయని పొలం

కంది, మొక్కజొన్న సాగుచేసుకోవచ్చు

రైతులు ప్రస్తుత పరిస్థితుల్లో కంది, మొక్కజొన్న, పొగాకు, పెసర తదితర పంటలు సాగుచేసుకోవచ్చు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకూ 53.43 శాతానికి పైగా పంటల సాగు నమోదైంది. సెప్టెంబర్‌లో 129 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా ఈనెల 10వ తేదీ వరకూ 7 శాతం మాత్రమే నమోదైంది. జూన్‌లో సాధారణ వర్షపాతం 58 మి.మీ కాగా 37 మి.మీ వర్షపాతం నమోదైంది. జూలైలో 88 మి.మీలకు గానూ 102 మి.మీ, ఆగస్టులో 92 మి.మీలకు గాను 122 మి.మీ వర్షపాతం నమోదైంది.
– శ్రీనివాసరావు, జేడీఏ ఒంగోలు

పంట	సాగు కావాల్సింది (హెక్టార్లలో)	సాగైంది (హెక్టార్లలో)
వరి	12,826	5385
జొన్న	156	55
సజ్జ	7020	2918
మొక్కజొన్న	3120	4952
రాగి	30	3
కొర్ర	1337	586
వరిగ	3	6
చిరుధాన్యాలు	0	20
కంది	68,287	36,074
పెసర	949	180
మినుములు	2,456	320
ఉలవలు	23	40
కొ గ్రామ్	107	11
వేరుశనగ	578	342
నువ్వులు	3,457	3,037
ఆముదం	1,537	1,259
సోయాబీన్	21	49
పొద్దుతిరుగుడు	163	19
పత్తి	26,981	12,759
జనుము	0	6
చెరకు	51	3
పొగాకు	0	959
మొత్తం	**1,29,102**	**68,983**

నేర నియంత్రణలో రాజీపడేది లేదు

● ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన వి.హర్షవర్ధన్ రాజు

ఒంగోలు టౌన్: నేరాల నియంత్రణలో ఎలాంటి రాజీ పడేది లేదని, అసాంఘిక శక్తుల ఆటకట్టించి నేరరహిత జిల్లాగా మార్చేందుకు తనదైన శైలిలో పని చేస్తానని ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు చెప్పారు. జిల్లా ప్రజలకు మరింతగా అందుబాటులో ఉంటానని అన్నారు. ఆదివారం మధ్యాహ్నం నూతన ఎస్పీగా ఆయన బాధ్యతలు చేపట్టారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ప్రజల సమస్యల పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తానని, ప్రజలకు మెరుగైన సేవలను అందించేందుకు అన్నివిధాలుగా చర్యలు తీసుకుంటానని చెప్పారు. శాంతి భద్రతల పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా, అలాంటి వారిని ప్రోత్సహించినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మహిళల భద్రతలకు, రక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తానన్నారు. శక్తి యాప్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పిస్తామని, యాప్‌ను డౌన్లోడ్ చేసుకొని ఆపద సమయాల్లో సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహిస్తామన్నారు. సైబర్ నేరాలపై ప్రత్యేకంగా దృష్టిసారిస్తామని చెప్పారు. పోలీసు సిబ్బంది సంక్షేమానికి కార్యాచరణ రూపొందించి నూతన ప్రణాళికలు అమలు పరుస్తామన్నారు. సిబ్బంది నుంచి అధికారుల వరకు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేలా కృషి చేస్తానని చెప్పారు. తొలుత స్వాతంత్ర్య యోధుడు ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన హర్షవర్ధన్ రాజు

అధికారుల అభినందనలు:

సాధారణ బదిలీల్లో భాగంగా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన హర్షవర్ధన్ రాజును జిల్లాకు చెందిన పోలీసు అధికారులు, డీపీఓ ఉద్యోగులు, సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు. ఏఎస్పీ (అడ్మిన్) నాగేశ్వరరావు, ఏఆర్ ఏఎస్పీ కొల్లూరు శ్రీనివాసరావు, డీఎస్పీలు రాయపాటి శ్రీనివాసరావు, లక్ష్మీ నారాయణ, నాగరాజు, సాయి ఈశ్వర్ యశ్వంత్, వన్‌టౌన్ సీఐ నాగరాజు, టూటౌన్ సీఐ మేడా శ్రీనివాసరావు, తాలూకా సీఐ విజయకృష్ణ, సీసీఎస్ సీఐ జగదీష్, ట్రాఫిక్ సీఐ పాండురంగారావు తదితరులు ఎస్పీని కలిసి అభినందనలు తెలిపారు. డీపీఓ ఏఓ రామ్మోహనరావు, డీసీఆర్బీ, డీటీసీ అధికారులు, సిబ్బంది ఎస్పీకి అభినందనలు తెలిపారు.

జిల్లా ప్రజల సహకారాన్ని మరచిపోలేను

● విజయనగరం జిల్లాకు బదిలీ అయిన ఎస్పీ ఏఆర్ దామోదర్‌కు ఘనంగా వీడ్కోలు

ఒంగోలు టౌన్: జిల్లా ప్రజలు, పోలీసు అధికారులు, సిబ్బంది అందించిన సహకారాన్ని ఎన్నటికీ మరచిపోలేనని ఎస్పీ ఏఆర్ దామోదర్ చెప్పారు. జిల్లాను వదిలివెళుతున్నప్పటికీ తన పరిధిలో సాయం అందించడానికి సిద్ధంగా ఉంటానని చెప్పారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన విజయనగరానికి వెళుతున్న సందర్భంగా ఆదివారం జిల్లా పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో కవాతు నిర్వహించి ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేరనియంత్రణ, గంజాయి నిర్మూలన, మహిళలు, బాలికలు, చిన్నారులపై నేరాలను అరికట్టడంలో సిబ్బంది కృషిని అభినందించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఆర్ ఏఎస్పీ కొల్లూరు శ్రీనివాసరావు, డీఎస్పీలు రాయపాటి శ్రీనివాసరావు, లక్ష్మీ నారాయణ, సాయి ఈశ్వర్ యశ్వంత్, రమణ కుమార్, కె.శ్రీనివాసరావు, పోలీస్ అధికారుల సంఘ రాష్ట్ర కార్యదర్శి హజరత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



జిల్లా పోలీసులకు వీడ్కోలు పలుకుతున్న ఎస్పీ ఏఆర్ దామోదర్

పోలీసు కళ్యాణ మండపంలో...

పోలీసు శాఖపై ప్రజల నమ్మకం పెరిగేలా నిబద్ధతగా పనిచేయాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. బదిలీపై విజయనగరం వెళుతున్న ఆయనను పోలీసు కళ్యాణ మండపంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గత 14 నెలల కాలంలో ప్రజలకు ఉత్తమ సేవలందించేందుకు అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది చూపిన చొరవ అభినందనీయమన్నారు. జిల్లాలో అనేక కార్యక్రమాలు చేపట్టామని, విద్యార్థులకు గంజాయి మీద అవగాహన కల్పించామన్నారు.

సమష్టి కృషితోనే జిల్లా అభివృద్ధికి బాటలు

● వీడ్కోలు సభలో కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు టౌన్: జిల్లా ఉన్నతాధికారులు, అన్నీ శాఖలకు చెందిన ఉద్యోగుల సమష్టి కృషితోనే జిల్లా అభివృద్ధికి బాటలు వేసేందుకు కృషి చేశానని కలెక్టర్ తమీమ్ అన్సారియా చెప్పారు. గుంటూరు జిల్లా కలెక్టర్‌గా బదిలీపై వెళుతున్న తమీమ్ అన్సారియాను జిల్లా అధికారులు ఆదివారం రిమ్స్ ఆడిటోరియంలో ఘనంగా సత్కరించారు. పలువురు అధికారులు కలెక్టర్‌తో కలిసి పనిచేసిన అనుభవాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం తమీమ్ అన్సారియా మాట్లాడుతూ ఉద్యోగులపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవడానికి బదులుగా ఆయా సమస్యలపై వారికి అవగాహన కల్పించడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించాలన్నదే తన అభిమతమన్నారు. గత 14 నెలల కాలంలో ఇదే విధానాన్ని పాటించినట్లు చెప్పారు. గత ఏడాది జూన్ 27న జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన తాను జిల్లాలో క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించినట్లు తెలిపారు. స్పష్టమైన అవగాహనతోనే బడుగు, బలహీన వర్గాల ప్రజలు ఎక్కువగా ఉన్న జిల్లా అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా పనిచేసినట్లు చెప్పారు. డ్వామా ఆధ్వర్యంలో నీటి సంరక్షణకు చేపట్టిన పనులకు జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు వచ్చిందన్నారు. కార్యక్రమంలో జేసీ ఆర్.గోపాల కృష్ణ, డీఆర్ఓ చిన ఓబులేసు, ఒంగోలు, కనిగిరి ఆర్డీఓలు లక్ష్మీ ప్రసన్న, కేశవర్ధన్ రెడ్డి, వివిధ శాఖల ఉన్నతాధికారులు మాట్లాడారు.



కలెక్టర్ తమీమ్ అన్సారియాను ఘనంగా సత్కరిస్తున్న ఉద్యోగులు

అభినవ విశ్వకర్మ సర్ మోక్షగుండం



- దేశంలో ఎన్నో ప్రాజెక్టులకు ప్రాణం పోసిన మేధావి విశ్వేశ్వరయ్య
- భారతరత్న బిరుదాంకితుడు మోక్షగుండం మనవాడే..
- పూర్వీకులది బేస్తవారిపేట మండలంలోని మోక్షగుండం
- నేడు విశ్వేశ్వరయ్య జయంతి

చిన్నచిన్న విషయాలకే ఆత్మహత్యల వంటి పెద్ద నిర్ణయాలు తీసుకునే నేటి యువతకు విశ్వవిఖ్యాత ఇంజినీర్ 'సర్' మోక్షగుండం విశ్వేశ్వరయ్య జీవితం ఓ ఆదర్శ గ్రంథం. జీవితంలో ఒడిదొడుకులను ఎదుర్కోవడానికి ఆయన పడిన కష్టం.. కష్టాల సుడిగుండంలో చిక్కుకున్నామనుకున్న వారికి పరిష్కారాన్ని చూపే పెద్దబాలశిక్ష. తన కష్టాన్ని సిమెంట్‌గా చేసి, కలలను ఇటుకలుగా మార్చి జీవితాన్ని అందంగా డిజైన్ చేసుకోవడమే కాక.. అలా తీర్చిదిద్దుకున్న అందమైన దారులగుండా ముందుకు సాగి ఎన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించారు ఈ ఇంజినీరింగ్ దిగ్గజం. ఆధునిక దేవాలయాలుగా జవహర్‌లాల్ నెహ్రూ కీర్తించిన ఎన్నో సాగునీటి ప్రాజెక్టులకు ప్రాణం పోశారు. భారత నిర్మాణ రంగంలోనే కాకుండా ప్రపంచ చరిత్రలో తనకంటూ ఓ సుస్థిర స్థానం సంపాదించుకున్నారు. అనితర సాధ్యమైన నిర్మాణ చాతుర్యాన్ని చూపిన విశ్వేశ్వరయ్యకు ప్రకాశం జిల్లాతో అనుబంధం ఉండటం మనకు గర్వకారణం. మోక్షగుండం చూపిన ప్రతిభ, చేసిన కృషికి గుర్తుగా భారత ప్రభుత్వం ఆయన జన్మదినమైన సెప్టెంబర్ 15వ తేదీని ఇంజినీర్స్ డేగా ప్రకటించింది. ఈ సందర్భంగా 'సర్ మోక్షగుండం' జీవిత విశేషాలపై 'సాక్షి' ప్రత్యేక కథనం..

బేస్తవారిపేట

ముద్దెనహళ్లిలో జననం

ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా మోక్షగుండం(ప్రస్తుతం ఇది ప్రకాశం జిల్లాలో ఉంది) గ్రామం నుంచి 18వ శతాబ్దంలో విశ్వేశ్వరయ్య పూర్వీకులు కర్ణాటక రాష్ట్రానికి వలస వెళ్లారు. అప్పటి మైసూర్ రాజ్యంలోని కోలార్ జిల్లా చిక్‌బళ్లాపూర్ తాలూకా ముద్దెనహళ్లిలో 1861 సెప్టెంబర్ 15వ తేదీన శ్రీనివాసశాస్త్రి, వెంకట లక్ష్మమ్మ దంపతులకు విశ్వేశ్వరయ్య జన్మించారు. తండ్రి శ్రీనివాసశాస్త్రి ఆయుర్వేద వైద్యుడు, సంస్కృత పండితుడు. చిక్‌బళ్లాపుర ప్రైమరీ స్కూల్లో విశ్వేశ్వరయ్య ప్రాథమిక విద్య పూర్తి చేశారు. 15 ఏళ్ల వయసులో ఉండగా తండ్రి మరణించడం ఆయన్ను బాగా కుంగదీసింది. దానికి తోడు కుటుంబ ఆర్థిక పరిస్థితులు తల్లకిందులు కావడంతో చదువును కొనసాగించే పరిస్థితులు కనిపించలేదు. అయినా సరే పట్టువదలకుండా చదువు కొనసాగించాలని నిర్ణయించుకున్నారు. తన మేనమామ హెచ్.రామయ్య సహకారంతో బెంగళూరులోని వెస్లియన్ మిషన్ హైస్కూల్లో ఉన్నత విద్య అభ్యసించారు. 1880లో బెంగళూరు నగరంలోని సెంట్రల్ కళాశాల నుంచి బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్ పట్టా పొందారు. ప్రఖ్యాత కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, పుణేలో ఇంజినీరింగ్ పూర్తి చేశారు.



మోక్షగుండం బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన విశ్వేశ్వర్య విగ్రహం

సర్ బిరుదాంకితుడు

మైసూర్ విశ్వవిద్యాలయ నిర్మాణ అనంతరం విశ్వేశ్వరయ్యను బ్రిటిష్ ప్రభుత్వం 'సర్' బిరుదుతో సత్కరించింది. 1955లో భారత ప్రభుత్వం భారతరత్న ఇచ్చి గౌరవించింది. ఎనలేని కీర్తిని సొంతం చేసుకున్న విశ్వేశ్వరయ్య 1962 ఏప్రిల్ 12న తుదిశ్వాస విడిచారు. ముద్దెనహళ్లిలోని నివాసం వెనుకనే మోక్షగుండ సమాధిని నిర్మించారు. విశ్వేశ్వరయ్య జ్ఞాపకార్థం పూర్వీకుల నిలయమైన బేస్తవారిపేట మండలం మోక్షగుండంలో ఆయన విగ్రహాన్ని పాతకోట నారాయణరెడ్డి నెలకొల్పారు. విశ్వేశ్వరయ్య పూర్వీకుల గృహాలు ఇప్పటికీ గ్రామంలో ఉన్నాయి.

ఫాదర్ ఆఫ్ మోడ్రన్ మైసూర్..

1909లో బ్రిటిష్ సర్వీస్‌ల నుంచి రిటైరైన తర్వాత మైసూర్ సంస్థానం మహారాజు కృష్ణ రాజవడయార్ ఆహ్వానం మేరకు మైసూర్ సంస్థానానికి చీఫ్ ఇంజినీర్ హోదాలో వచ్చారు. 1912లో మైసూర్ సంస్థానానికి దివాన్‌గా నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తూ మైసూర్ సర్వతోముఖాభివృద్ధికి కృషి చేశారు. అందుకే ఆయనను 'ఫాదర్ ఆఫ్ మోడ్రన్ మైసూర్ స్టేట్'గా పిలుస్తున్నారు.



విశ్వేశ్వరయ్య పూర్వీకుల గ్రామం మోక్షగుండం

ఇంజినీర్‌గా ఎన్నో అద్భుతాలు

చదువు పూర్తయిన అనంతరం 1884లో ముంబైలో పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ ఇంజినీర్‌గా ఉద్యోగంలో చేరిన విశ్వేశ్వరయ్య అంచెలంచెలుగా ఎదిగారు. అనంతరం నాసిక్, ఖాందేష్, పుణేలో పనిచేశారు. 1896లో సూరత్‌లో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా విధులు నిర్వర్తించారు. ఉన్నత చదువు కోసం లండన్ వెళ్లినా.. ప్రభుత్వ పిలుపుతో మధ్యలోనే తిరిగివచ్చారు.

- డ్యామ్‌లలో ఎక్కువ ఉధృతితో నీరు వచ్చి చేరినా రిజర్వాయర్‌కు ఎటువంటి హాని కలగకుండా చేసే 'ఆటోమేటిక్ వెయిర్ వాటర్ ఫ్లడ్ గేట్స్'ను రూపొందించారు. 1903లో పుణే సమీపంలోని ఖడక్‌వాస్లా రిజర్వాయర్‌కు ప్రయోగాత్మకంగా ఈ గేట్లను అమర్చారు. దీంతో మోక్షగుండానికి ప్రపంచ స్థాయిలో గుర్తింపు లభించింది.
- విశ్వేశ్వరయ్య ప్రతిభను గుర్తించిన ఆంగ్ల పాలకులు ప్రపంచ జలాశయాల్లో ఒకటైన సుక్కూర్ బ్యారేజ్ నిర్మాణానికి ఇంజినీర్‌గా నియమించారు. సింధూనది నీరు సుక్కూర్‌కు చేర్చడంతోపాటు.. ఆ నీటిని వడకట్టడానికి ఒక వినూత్న పద్ధతిని రూపొందించి ప్రతిభ చాటారు.
- మైసూర్ దగ్గర కావేరి నదిపై కృష్ణరాజ సాగర డ్యామ్ నిర్మించి లక్షలాది ఎకరాలకు సాగు నీరు అందించారు. ఆనకట్ట దిగువనే బృందావన గార్డెన్స్‌ను ఏర్పాటు చేసి దేశ విదేశాల్లో పర్యాటకుల్ని ఆకర్షించారు.
- ఒడిశాలోని హీరాకుడ్ డ్యాం, భద్రావతిలో ఇనుము–ఉక్కు కర్మాగారానికి రూపకల్పన చేశారు.
- మైసూర్‌లో గంధపు తైలం, గంధపు సబ్బుల తయారీ కర్మాగారాలు నెలకొల్పారు.
- స్టేట్ బ్యాంక్ ఆఫ్ మైసూర్, మైసూర్ విశ్వవిద్యాలయం ఏర్పాటులో విశ్వేశ్వరయ్య కృషి ఎనలేనిది.
- 1908 సెప్టెంబర్ 28వ తేదీన హైదరాబాద్‌లో మూసీ నది వరదల బీభత్సాన్ని చూసిన మోక్షగుండం.. వరద రక్షక పనులు, భూగర్భ డ్రెయినేజీకి రూపకల్పన చేశారు. తాగు నీటి అవసరాల కోసం హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ రిజర్వాయర్లు రూపొందించి భాగ్య నగర వాసుల దాహార్తి తీర్చారు.
- బెంగళూరులో విమాన కార్ఖానా, విశాఖలో నౌకా నిర్మాణ కేంద్ర రూపశిల్పి మోక్షగుండమే.
- 1901లో భారత ప్రతినిధిగా జపాన్ వెళ్లి అక్కడి కుటీర పరిశ్రమలను పరిశీలించి మన దేశంలోనూ కుటీర పరిశ్రమల అభివృద్ధికి పథకాలు రచించారు.
- 1906లో ఈడెన్ నగర నీటి సరఫరా ప్రణాళికను రూపొందించారు. కొల్హాపూర్, ధార్వాడ, బీజాపూర్ పట్టణాల మంచి నీటి పథకాలకు రూపకల్పన చేశారు.
- ప్లాన్డ్ ఎకానమీ ఆఫ్ ఇండియా, మెమోరీస్ ఆఫ్ మై వర్కింగ్ లైఫ్, రీకన్‌స్ట్రక్టింగ్ ఇండియా అనే గ్రంథాలను విశ్వేశ్వరయ్య రచించారు.

మార్కాపురం మెడికల్ కాలేజీని ప్రభుత్వమే నిర్వహించాలి



మెడికల్ కాలేజీ వద్ద సీపీఎం నాయకుల బృందం

- సీపీఎం నాయకుల డిమాండ్
- పీపీపీ విధానంతో పేదలకు తీవ్ర నష్టమని ఆందోళన

మార్కాపురం టౌన్: మార్కాపురం మెడికల్ కాలేజీని పీపీపీ పేరుతో ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించే నిర్ణయాన్ని విరమించుకోవాలని, ప్రభుత్వమే కాలేజీని నిర్వహించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కే మాబు డిమాండ్ చేశారు. సీపీఎం బృందం ఆదివారం సాయంత్రం మెడికల్ కాలేజీని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పశ్చిమ ప్రాంతానికి మెడికల్ కాలేజీ అత్యంత అవసరమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో మెడికల్ కాలేజీని పూర్తి చేస్తామని హామీ ఇచ్చి మాటతప్పిందన్నారు. యర్రగొండపాలెం, గిద్దలూరు, మార్కాపురం, దర్శి, కనిగిరి ప్రాంతాల్లోని పేద, దళిత, గిరిజన ప్రజలకు వైద్యం అందుబాటులోకి రావాలంటే మెడికల్ కాలేజీ అవసరమన్నారు. పీపీపీ విధానం వల్ల కాలేజీ ప్రైవేట్ పరమైతే అన్ని రకాల వైద్యసేవలకు డబ్బు చెల్లించాల్సి వస్తుందన్నారు. కాలేజీ పేరుతో జరుగుతున్న రాజకీయాలను ఆపి నిర్మాణంపై దృష్టిపెట్టాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సోమయ్య, పట్టణ కార్యదర్శి రఫీ, మండల కార్యదర్శి బాలనాగయ్య, రూబెన్, నన్నేసా, రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెలిగొండ ప్రాజెక్టుపై మాటలేనా.. చేతలేవీ?

- మిగులు పనులు చేపట్టకుండా 2026లో నీళ్లెలా ఇస్తారు?
- సాగును లాభసాటిగా మారిస్తేనే రైతుల చావులు ఆగుతాయ్
- రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జయంత్ బాబు

మార్కాపురం: వెలిగొండ ప్రాజెక్టుపై కూటమి ప్రభుత్వం ప్రకటనలు, వాగ్దానాలకే పరిమితమైనట్లుగా ఉందని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జె.జయంత్ బాబు విమర్శించారు. ఆదివారం మార్కాపురం మండల రైతు సంఘం 8వ మహాసభ పెద్దనాగులవరం గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2026 వరద సీజన్ నాటికి నీరు విడుదల చేస్తామన్న హామీ అమలు చేస్తారా అని ప్రశ్నించారు. త్వరితగతిన పెండింగ్ పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ, నీటి పారుదల రంగాన్ని చిన్నచూపు చూస్తున్నాయని విమర్శించారు. వెలిగొండ పనులు ప్రారంభించి 30 ఏళ్లు గడిచినా ప్రాజెక్టు పూర్తిచేయకపోవడమే ఇందుకు నిదర్శనమన్నారు. రాష్ట్రంలో పండించిన పంటలకు ఏడాది కాలంగా గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు అప్పుల పాలవుతున్నారని అన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చినప్పుడే రైతుల ఆత్మహత్యలు నివారించగలమన్నారు. యుద్ధ ప్రాతిపదికన వెలుగొండ ప్రాజెక్టును పూర్తిచేయాలని డిమాండ్ చేశారు.

కాగా, మండల రైతు సంఘ అధ్యక్ష కార్యదర్శులుగా ఓర్సు అడివయ్య, గంగిరెడ్డిని ఎన్నుకున్నట్లు సంఘ నాయకుడు రాజశేఖరరెడ్డి తెలిపారు. సమావేశంలో రైతు సంఘ నాయకులు సోమయ్య, రూబెన్, బాల నాగయ్య, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జయంత్‌బాబు

రైలు నుంచి జారిపడి మహిళ మృతి



మృతి చెందిన గుర్తు తెలియని మహిళ

ఒంగోలు టౌన్: వేగంగా వెళ్తున్న రైలు నుంచి జారి పడి గుర్తు తెలియని ఓ మహిళ మృతి చెందింది. జీఆర్పీ పోలీసుల కథనం ప్రకారం.. ఒంగోలు–కరవది రైల్వే స్టేషన్ల మధ్య గుర్తు తెలియని ఒక మహిళ ఆదివారం ఉదయం రైలు నుంచి జారిపడి అక్కడికక్కడే మరణించింది. సుమారు 30 ఏళ్లకుపైగా వయసు కలిగిన ఆమె వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతురాలు పూల డిజైన్ కలిగిన నిండు పచ్చరంగు పంజాబీ డ్రెస్ ధరించి ఉంది. రైల్వే స్టేషన్ మాస్టర్ ఫిర్యాదు మేరకు జీఆర్పీ ఎస్సై కె.మధుసూధన రావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. మృతురాలి వివరాలు తెలిసిన వారు ఆర్పీ ఎస్సై 9440627647ను సంప్రదించాలని కోరారు.

షార్ట్ సర్క్యూట్‌తో జేసీబీ దగ్ధం!



మంటల్లో పూర్తిగా కాలిపోయిన జేసీబీ

కంభం: జేసీబీ వాహనంలో విద్యుత్ తీగలు షార్ట్ సర్క్యూట్ కావడంతో పూర్తిగా కాలిపోయింది. ఈ సంఘటన కంభం మండలంలోని యర్రబాలెం సమీపంలో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. మార్కాపురానికి చెందిన ఎస్.వెంకటరామిరెడ్డి గిద్దలూరులో పనుల నిమిత్తం జేసీబీని తీసుకెళ్లారు. అక్కడ పనులు ముగిసిన తర్వాత శనివారం అర్ధరాత్రి గిద్దలూరు నుంచి మార్కాపురం వెళ్తుండగా యర్రబాలెం–నల్లకాల్వ మధ్య వాహనంలో వైర్లు షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన వచ్చి మంటలు అదుపుచేశారు. అప్పటికే వాహనం మొత్తం దగ్ధమైందని, సుమారు రూ.14 లక్షల మేర నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయారు.

క్లుప్తంగా

కనిగిరిలో రూ.4 లక్షలు అపహరణ

కనిగిరి రూరల్: గుర్తు తెలియని దుండగులు ఇంట్లోకి చొరబడి రూ.4 లక్షల నగదు అపహరించిన సంఘటన ఆదివారం కనిగిరిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని ఓవీ రోడ్డులో నివాసం ఉంటున్న మునగనూరి సత్యవతి శనివారం ఇంటికి తాళం వేసి పామూరులోని బంధువుల వద్దకు వెళ్లింది. అయితే ఆదివారం ఇంటి తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించిన ఇరుగుపొరుగు వారు వెంటనే సత్యవతికి సమాచారం ఇచ్చారు. ఇంట్లో బీరువా తాళం పగలగొట్టి పొదుపు గ్రూపు సొమ్ము రూ.2 లక్షలు, వ్యాపారానికి సంబంధించిన నగదు మరో రూ.2 లక్షలను దొంగలు చోరీ చేశారని బాధితురాలు పోలీసులకిచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాయవరంలో చోరీ



మార్కాపురం: మండలంలోని రాయవరం గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగలగొట్టి బంగారు ఆభరణాలు, నగదు అపహరించిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. మార్కాపురం రూరల్ పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన జేమ్స్ ఆదివారం ఉదయం మార్కాపురం పట్టణానికి వచ్చారు. కుటుంబ సభ్యులు చర్చిలో ప్రార్థనకు వెళ్లారు. ఈ సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళం పగలగొట్టి, బీరువా తెరిచి చైను, నల్లపూసలదండ, ఉంగరం, రూ.10 వేల నగదు, వెండి ఆభరణాలు దొంగిలించారు. చోరీ అయిన సొత్తు విలువ సుమారు రూ.2.50 లక్షలకు పైగా ఉంటుందని భావిస్తున్నారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అంతర్జాతీయ ఫెన్సింగ్ పోటీలకు ఇద్దరు బాలికలు



లిఖితారెడ్డి, చక్రికను అభినందిస్తున్న నాగేశ్వరరావు

ఒంగోలు: అంతర్జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు జిల్లాకు చెందిన ఇద్దరు బాలికలు ఎంపికయ్యారు. ఇటీవల ఉత్తరాఖండ్ రాష్ట్రం హల్ద్వానిలో నిర్వహించిన జాతీయ స్థాయి అండర్ 17 (క్యాడెట్) పోటీల్లో చెరువుకొమ్ముపాలేనికి చెందిన పూసపాటి లిఖితా రెడ్డి, చీమకుర్తికి చెందిన పుత్తూరి చక్రిక సత్తా చాటారు. అంతర్జాతీయ పోటీలకు ఏపీలోని పశ్చిమ గోదావరి నుంచి నలుగురు, కర్నూలు నుంచి ముగ్గురు, ప్రకాశం నుంచి ఇద్దరు ఎంపికయ్యారు. వీరికి ప్రస్తుతం ఢిల్లీలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఈనెల 19 నుంచి ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానిలో నిర్వహించనున్న అంతర్జాతీయ(ఏషియన్ ఫెన్సింగ్) పోటీల్లో వీరు దేశం తరపున ప్రాతినిధ్యం వహించనున్నారు. ఎంపికైన బాలికలతోపాటు కోచ్ రాజును జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు వి.నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి జీఎస్‌వీ కృష్ణమోహన్, జిల్లా కార్యదర్శి జి.నవీన్, ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కుర్రా భాస్కరరావు ప్రత్యేకంగా అభినందించారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ జట్ల ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన కబడ్డీ బాలబాలికల జట్లు

ఒంగోలు: రాష్ట్ర స్థాయి జూనియర్ బాలబాలికల కబడ్డీ జట్లను ఆదివారం ఒంగోలులోని మినీ స్టేడియంలో ఎంపిక చేశారు. ఈ సందర్భంగా కబడ్డీ అసోసియేషన్ జిల్లా చైర్మన్ ఎస్.చంద్రమోహన్‌రెడ్డి, కార్యదర్శి కుర్రా భాస్కరరావు మాట్లాడుతూ.. బాలుర జట్టుకు కొత్తపట్నంలో, బాలికల జట్టుకు పాకలలో శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపిక చేసిన జట్లు ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు ఎన్‌టీఆర్ జిల్లా గొల్లపూడిలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని పేర్కొన్నారు. శిక్షణ శిబిరాల్లో వసతులను కబడ్డీ అసోసియేషన్ చీఫ్ ప్యాట్రన్ డాక్టర్ నల్లూరి సుబ్బారావు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అసోసియేషన్ కార్యదర్శి యామారప్ప పూర్ణచంద్రరావు, కోశాధికారి డి.రమేష్, ఉపాధ్యక్షుడు సిరిగిరి రంగారావు, గద్దం శ్రీను, సుమతి తదితరులు పాల్గొన్నారు.

బాలుర జట్టు : రాఘవేంద్ర(కొత్తపట్నం), కె.దశరథుడు(మార్కాపురం), కె.రామకృష్ణ(గిద్దలూరు), వి.నాగచైతన్య(రాజుపాలెం), పి.వినీల్‌రెడ్డి(కొత్తపట్నం), ఆర్.అభిషేక్‌రెడ్డి(కంభం), కె.బ్రహ్మశివాజీ(వేమవరం), కె.ఆకాష్(గొట్లగట్టు), బి.హరినాథ్(మడనూరు), ఎం.లాలశివ(దొర్నాల), టి.బాబి(ఒంగోలు), జె.రామాంజనేయులు(ఈదర), బి.అయ్యప్ప(ఒంగోలు), బి.సుబ్బారెడ్డి(ఈతముక్కల), స్టాండ్‌బైలుగా పి.రుత్విక్(కనిగిరి), కె.షణ్ముఖ్‌రాజ్(ఒంగోలు), ఎస్‌కె అజ్మల్(సీఎస్‌పురం), సీహెచ్ సంతోష్(కొత్తపట్నం), ఆర్.శివనాయక్(మార్కాపురం).

బాలికల జట్టు : వి.అర్చన, కె.భూమిక, కె.నందిని, కె.త్రిపుర, కె.త్రిగుణ, కె.సౌమ్య, కె.విజయలక్ష్మి , నందిని(పాకల), డి.హసన్‌బీ, ఎస్.కాశీశ్వరి(మార్కాపురం), డి.జ్యోత్స్న(వై.డి.పాడు), ఎం.శ్రీలత(గొట్లగట్టు), ఎం.పల్లవి(కనిగిరి), కె.కీర్తన(ఒంగోలు), స్టాండ్‌బైలుగా యు.రూతు(వై.డి.పాడు), టి.నాగమణి(ఒంగోలు), కె.మహిమ(మద్దిపూడి).

22 నుంచి భైరవకోనలో శరన్నవరాత్రి ఉత్సవాలు



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఈఓ

సీఎస్‌పురం(పామూరు): ప్రఖ్యాత పుణ్యక్షేత్రం, పర్యాటక కేంద్రమైన భైరవకోనలో ఈనెల 22 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు దసరా శరన్నవరాత్రి వేడుకలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయం వద్ద చేపడుతున్న ఏర్పాట్లను ఆదివారం ఈఓ డి.వంశీకృష్ణారెడ్డి, ముప్పాళ్ల శ్యామ్‌సుందర్‌రాజు పర్యవేక్షించారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా క్యూలైన్లు, తాగునీరు, ఇతర వసతులు కల్పిస్తామని ఈఓ వంశీకృష్ణారెడ్డి తెలిపారు.

త్రిముఖదుర్గాదేవి ప్రత్యేక అలంకారాలు..

దసరా శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా భైరవకోన త్రిముఖదుర్గాదేవి ఆలయంలో అమ్మవారు 22వ తేదీ సోమవారం బాలా త్రిపుర సుందరీదేవిగా, 23న శ్రీరాజరాజేశ్వరీదేవి, 24న అన్నపూర్ణాదేవి, 25న శ్రీగాయత్రీదేవి, 26న మోహినీదేవి, 27న శ్రీగజలక్ష్మీదేవి, 28న సరస్వతీదేవి, 29న మహిషాసురమర్దిని, 30న శ్రీదుర్గాదేవి, అక్టోబర్ 1వ తేదీన లలితాదేవిగా దర్శనమిస్తారని ఈఓ వివరించారు. 2న విజయదశమి పూజలతో శరన్నవరాత్రి ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు.

కారు ఢీకొని వృద్ధుడి మృతి

ఒంగోలు టౌన్: వేగంగా వస్తున్న కారు అదుపుతప్పి మోపెడ్ మీద వెళ్తున్న ఒక వృద్ధుడిని ఢీకొన్న ఘటన ఆదివారం ఉదయం జరిగింది. నగరంలోని సమతా నగర్‌లో నివశించే రాయని శేషయ్య (54) మోపెడ్ మీద ఒంగోలు నుంచి పేర్నమిట్టకు వెళుతున్నారు. కర్నూలు రోడ్డులో టుబాకో బోర్డు వద్దకు రాగానే వెనక నుంచి వేగంగా వచ్చిన కారు అదుపుతప్పి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శేషయ్యను జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆయన చనిపోయారు. తాలూకా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

డీటీసీ సీఐ షమీవుల్లాపై సస్పెన్షన్ వేటు

సాక్షి టాస్క్‌ఫోర్స్: కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు మరో ఇద్దరు సీఐలు బలయ్యారు. ఒంగోలు డీటీసీ సీఐ షేక్ షమీవుల్లాను సస్పెండ్ చేస్తూ ఐజీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది. రెండేళ్ల క్రితం పల్నాడు జిల్లా మాచర్ల సీఐగా పనిచేసిన సమయంలో ఆయనపై వచ్చిన ఆరోపణల విషయంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఆయనతో పాటు బాపట్ల ఐటీ కోర్‌లో సీఐగా పనిచేస్తున్న జయకుమార్‌ను కూడా సస్పెండ్ చేసినట్లు తెలిసింది. ఈయన కారంచేడు సీఐగా పనిచేసి ప్రసుతం బాపట్ల ఐటీ కోర్‌లో పనిచేస్తున్నారు. రెండేళ్ల క్రితం జరిగిన ఘటనలను సాకుగా చూపి ఈ ఇద్దరు సీఐలను సస్పెండ్ చేయడం పోలీసు శాఖలో కలకలం రేపుతోంది. కేవలం కక్షసాధింపు చర్యల్లో భాగంగానే వీరిని సస్పెండ్ చేసినట్లు ప్రచారం జరుగుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వీరిని లూప్‌లైన్‌లో పెట్టారని, అయినప్పటికీ వదిలిపెట్టకుండా వెంటాడి మరీ చివరికి సస్పెండ్ చేసినట్లు పోలీసు శాఖలో చెవులు కొరుక్కొంటున్నారు.